క్లుప్తంగా

'గుడిసెలు ఖాళీ చేయించడం హేయం'

ములుగు రూరల్ : మండలంలోని ఇంచర్ల శివారులోని అంబేడ్కర్ నగర్‌లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడం హేయమైన చర్య అని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు బానోతు నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి గుడిసెలు ఖాళీ చేయించాలని అన్నారు. లేని పక్షంలో రైతు కూలీసంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు


కాటం మల్లారెడ్డి

గోవిందరావుపేట: పీఆర్‌టీయూ టీఎస్ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో మండలం నుంచి ఇద్దరికి చోటు లభించింది. అసోసియేట్ అధ్యక్షులుగా కాటం మల్లారెడ్డి (హెచ్‌ఎం జెడ్పీహెచ్‌ఎస్ చల్వాయి), ఉపాధ్యక్షులుగా మాలోత్ ఈరు (ఎస్‌ఏ ఎంపీయూపీఎస్ సోమలగడ్డ) వారు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం లభించడానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు వేం యాకుబ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం, రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డిలకు మండలశాఖ, మా తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీ అధికారికి వీడ్కోలు



ములుగు రూరల్: మండలంలో 11 ఏళ్లుగా మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించి రైతుల మన్ననలు పొందిన మునుకుంట్ల సంతోష్‌ను రైతులు ఘనంగా సన్మానించారు. బుధవారం మండలంలోని పత్తిపల్లి రైతు వేదికలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌ను, మండలంలో నూతనంగా వచ్చిన మండల వ్యవసాయ అధికారి పరమేశ్వర్‌ను సన్మానించారు. రైతు అంజిరెడ్డి మాట్లాడుతూ మండల రైతులకు సుదీర్ఘ కాలం సేవలందించి రైతులకు పంటల సాగు సలహాలు సూచనలు అందించిన సంతోష్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పులిగుండం, పొట్లాపూర్, దేవగిరిపట్నం రైతులు సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, భవసింగ్, కుమారస్వామి, విష్ణు, రాంచందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ములుగు రూరల్ : మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య పాముకాటుకు గురై మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. బుధవారం సాంబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. ఆమె వెంట నాయకులు ఉయ్యాల రాజయ్య, కుమారస్వామి, వేములపల్లి భిక్షపతి, గండి కుమార్, చంద్రమౌళి, ప్రభాకర్, గొర్రె సమ్మయ్య, విజయరాంనాయక్, భద్రయ్య, నాజర్‌ఖాన్ ఉన్నారు.

వైద్యశాలలో బతుకమ్మ వేడుకలు



వెంకటాపురం(కె) : మండలంలోని ఎదిర ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నేహా, వినయ్, ఆశిష్, సిబ్బంది జ్యోతి, మనోహర్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శులకు శిక్షణ తరగతులు

కాటారం : మండల పంచాయతీ అధికారి పి.వీరస్వామి మండలంలో ల్యాండ్ రెగ్యులేషన్ సర్వే (ఎల్‌ఆర్‌ఎస్)పై బుధవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫీల్డ్‌లో మెకాపై చేయాల్సిన సర్వేపై ప్రాక్టికల్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజనీర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తయ్యేదెప్పుడో ?


కొంగాల వాగువద్ద రహదారిపై దిగబడిన ట్రాక్టర్ (ఫైల్)


దిగబడిన బస్సును బయటకు లాగుతున్న ట్రాక్టర్ దోజర్ (ఫైల్)

- బ్రిడ్జీలు నిర్మించారు.. లింక్ పనులు ఆపేశారు
- 25 గ్రామాలకు తప్పని తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

వాజేడు : వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల రెండు బ్రిడ్జిల సమీపంలో రహదారి పనులను పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. ఇప్పటికే రహదారి పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా పనులను చేయకపోవడం విడ్డూరం. హైలెవెల్ బ్రిడ్జితో పాటు, కొంగాల వాగులపై బ్రిడ్జిలను నిర్మించి సమీపంలోని రహదారి పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. ఈ పనులను ఎప్పుడు చేస్తారో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే రహదారి పనులను పూర్తి చేయ్యాల్సిన కాంట్రాక్టర్ ఇంత వరకు రహదారి పనులను చేపట్టలేదు. ఇన్ని రోజులు వర్షాలు కురవడంతో పనులను చేపట్ట లేదని ప్రజలు భావించినప్పటికీ ఇప్పుడు వర్షాలు తగ్గాయి అయినప్పటికీ రహదారి పనులను చేపట్టక పోవడంతో మండల ప్రజలు తీవ్ర స్థాయిలో వ్యతి రేకిస్తున్నారు. వర్షాల సమయంలో కొంగాల వాగు సమీపంలో రహదారిపై ఆర్టీసీ బస్సు దిగబడింది. పోలీసుల సహకారంతో మరుసటి రోజు బస్సును బయటకు లాగారు. ఆ తర్వాత రైతులు పోలీసుల సహకారం తీసుకుని గుంతలు పడిన చోట రహదారిపై కంకర పోశారు.

25 గ్రామాలకు తప్పని తిప్పలు

ఈ రెండు బ్రిడ్జిల సమీపంలో రహదారిని పూర్తి చేయకపోవడంతో 25 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాజేడుకు ఏదో ఒక పని మీద 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే రహదారిపై రావాల్సి ఉండగా రహదారి పనులు పూర్తి కాకపోవడంతో చుట్టు తిరిగి జగన్నాథపురం మీదుగా వాజేడుకు వస్తున్నారు. మండల కేంద్రానికి అవతలివైపున గుమ్మడి దొడ్డి నుంచి టేకులగూడెం వరకు ఉన్న గ్రామాల పజలకు ఈ రహదారిపైనే వాజేడుకు రావాల్సి ఉంటుంది. కాగా ఈ రహదారిపై ధైర్యం చేసి వస్తున్న వారి వాహనాలు పల్టీలు కొట్టగా కొన్ని వాహనాలు బురదలో దిగబడిన సంఘటనలు ఉన్నాయి.

రైతులకు తప్పని ఇబ్బందులు

వాజేడు మండల కేంద్రం నుంచి గుమ్మడిదొడ్డి గ్రామం వరకు రైతులు మిర్చి పంటలను సాగు చేస్తారు. వ్యవసాయ సీజన్‌లో తప్పనిసరిగా ఈ రహదారి గుండా వెళ్లాల్సి ఉంటుంది. కూలీలను తరలించడం, మందు బస్తాలను తీసుకు వెళ్లడం మొదలైన పనులు చేసుకుంటారు. రహదారి సౌకర్యం సక్రమంగా లేక పోవడంతో ఇప్పటికి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పనులను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాలలో రాణిస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉపాధ్యాయ నియామక పరీక్ష 2024లో ములుగు జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్‌లోని విద్యార్థులు సత్తాచాటారు. తాడ్వాయి మండలం వీరాపురం గ్రామానికి చెందిన జవాజీ ప్రజిత్, ఏ టూరునాగారం మండలం శాపల్లికి చెందిన రాజేష్‌లు పదో తరగతి వరకు చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలలోనే చదువుకున్నారు. టీచర్లను హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు, సంతోష్ అభినందించారు.

సద్దుల బతుకమ్మకు పల్లెలు ముస్తాబు


గోవిందరావుపేట : సోమలగడ్డలో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న అధికారులు


ఏటూరునాగారం : రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండలంలోని సద్దుల బతుకమ్మకు పల్లెలు ముస్తాబు అవుతున్నాయి. గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకునేందుకు ఆడపడుచులు కావాల్సిన సరుకులు, పూలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రధాన రోడ్లు, షాపులు కిక్కిరిసిపోయాయి. రంగుల, పూల దుకాణాల వద్ద మహిళలు బతుకమ్మకు కావాల్సిన రంగులు, పూలను కొనుగోలు చేస్తున్నారు. అంతే కాకుండా రామాలయంలో పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు రామాలయం కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. విద్యుత్ దీపాలను అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. వై జంక్షన్ వద్ద ప్రత్యేకమైన లైటింగ్‌తో విద్యుత్ దీపాలను వెలిగించి ముస్తాబు చేస్తున్నారు.

తాడ్వాయి: మండలంలో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు ఏర్పాట్లు చేశారు. గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం చెరువు వద్ద బతుకమ్మ తల్లి విగ్రహానికి రంగులు వేశారు. గంగారం, కాటాపూర్ జీపీ పరిధిలోని అన్నారం చెరువు వద్ద మహిళలు బతుకమ్మ ఆడటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు గ్రామాల మహిళలు అన్నారం చెరువు వద్ద బతుకమ్మ ఆడనున్నారు.

గోవిందరావుపేట: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచే బతుకమ్మ పండుగలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మకు నేడు చివరి రోజు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా పూలను పూజించే పండుగ బతుకమ్మ. మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సద్దుల బతుకమ్మ నిర్వహణకు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఎంపీఓ శరత్, ఏపీఓ ప్రసూన పర్యవేక్షించారు.

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

- సీఐ అనుముల శ్రీనివాస్


మాజీ మావోయిస్టులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎవరూ కూడా చేయకూడదని సంఘ విద్రోహశక్తులకు సహకరించకూడదని, గ్రామాల్లోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మాజీ మావోయిస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఐక్యతగా అందరూ కలిసిమెలిసి దసరా ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ప్రస్తుతం వారు ఎవరెవరు ఏం పనులు చేస్తున్నారు... వారి జీవన ఆధారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎవరిని బెదిరింపులకు గురి చేయకూడదని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే చూస్తూ ఊరుకునేది లేదని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్‌ఏ నేషనల్ అవార్డు అందుకున్న హెచ్‌ఎం


అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం పాడియా గంగునాయక్

గోవిందరావుపేట : రాజనీతిజ్ఞుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్‌ఏ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న దేశమంతటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొని, డాక్టర్ రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన కృషికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 6న తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో బహుజన సాహిత్య అకాడమీ వారి చేత అత్యుత్తమ ఉపాధ్యాయుల నేషనల్ అవార్డుల పురస్కారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ములుగు జిల్లా నుంచి గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న హెచ్‌ఎం పాడియా గంగునాయక్‌కి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గంగునాయక్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది అని, పిల్లల చదువుల పట్ల నాకు చాలా ఆసక్తి ఉంటుందన్నారు. నన్ను, నా శ్రమని గుర్తించి నేషనల్ ఆవార్డును బహూకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ములుగు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పత్తిపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా ఇమినేషన్ అధికారి డాక్టర్ రణధీర్, ఏఎంఓ దుర్గారావు సబ్ యూనిట్ ఆఫీసర్ సాంబయ్యలు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వృద్ధి చెందడం వల్ల డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడే అవకాశం ఉంటుందని అన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. శిబిరంలో 60 మంది ఓపీ సేవలు అందించగా 11 మంది జ్వరంతో బాధపడుతుండగా వారికి ఆర్‌టీడీ పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని డ్రైయినేజీలు, నీటి నిల్వల ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాన్షీరాం ఆశయ సాధనకు పోరాడాలి


కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

వెంకటాపురం(కె) : బహుజన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయ సాధనకు బహుజనులు పోరాడాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు యాసం రమేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం కాన్షీరాం 18వ వర్ధంతిని మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ కాన్షీరాం ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొడారి వినాయకరావు, చెన్నం గోపి, వంకాయల వెంకటేశ్వర్లు, చిట్యాల చక్రి, చిట్యాల సాగర్, చెన్నం నరేష్, గౌతమ్, తిప్పనపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ


చేప పిల్లలను అందిస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి, కలికోట, వెంకట్రావుల్లి, పంగిడిపల్లి, వెలిశాల, రామకిష్టాపూర్(వి), ఎంపేడు గ్రామాల మత్స్యకారులకు బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీవోఓ అనిత చేతుల మీదుగా మత్స్య శాఖ భూపాలపల్లి జిల్లా 2024–25 సంవత్సరానికి గానూ 100 శాతం రాయితీతో రూ.10 లక్షల విలువైన చేప పిల్లలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మండలంలోని మత్స్యకారులు చెరువుల్లో చేపలను పెంచుకుని ఉపాధితో పాటు, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, సొసైటీ అధ్యక్షుడు ఊటిపెల్లి సమ్మయ్య, మత్స్యకారులు నరెడ్ల సమ్మయ్య, అనవేని మొగిళి, శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనాలతో సందడే..సందడి


జనాలతో కిక్కిరిసిన మండల కేంద్రం

టేకుమట్ల : సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా బుధవారం మండల కేంద్రం సందడే సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జనాలతో సందడిగా మారింది. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు, మొగుళ్లపల్లి, చిట్యాల మండలాల ప్రజలు సైతం మండల కేంద్రంలో పండుగ షాపింగ్ చేస్తుండడంతో బిజీబిజీగా మారింది. మండల కేంద్రం నుంచి రాఘవరెడ్డిపేట, అంకుషాపూర్, ఆశిరెడ్డిపల్లి, చిట్యాల ప్రధాన రోడ్ల వెంట జనాలతో నిండుకుంది. దసరా పండగ వేళ వ్యాపారపరంగా సంతృప్తి ఉందని వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న దుర్గామాత ఉత్సవాలు


గోవిందరావుపేట : భక్తులకు చీరలు బహూకరిస్తున్న దాతలు


మంగపేట : సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

గోవిందరావుపేట: మండలంలోని పస్రా, గోవిందరావుపేట, చల్వాయి గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగాంగ పస్రా రామాలయంలో, గోవిందరావుపేట అయ్యప్పస్వామి ఆలయం, చల్వాయి రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో కొలువుతీరిన అమ్మవార్లు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమివ్వగా పూజారులు డింగిరి రంగాచార్యులు, ఆకాష్ శర్మ, గోవర్ధన కిరణ్‌చార్యులు, సలేంద్ర రాజేంద్రచారి, క్రాంతిలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గోవిందరావుపేటలోని అయ్యప్పస్వామి అలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా కరీముల్లా స్వాతి శ్రీనివాసరావు, పోతంశెట్టి లక్ష్మీ వెంకట్, సూదిరెడ్డి జయమ్మలు ఆలయ కమిటీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిఎంకే గాంధీ ఆధ్వర్యంలో కోలాటం వేసే భక్తులకు చీరలు బహూకరణ చేశారు. కార్యక్రమాల్లో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవి అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చింది. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో బాగంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏడో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో అర్చకులు విస్సావజ్జుల నరేష్‌శర్మ ఉమాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిమను సరస్వతీదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని తిమ్మంపేట, రాజుపేట, రమణక్కపేట, కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, చెరుపల్లిలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. ఈ సందర్భంగా పలుగ్రామాల్లో భక్తులకు దేవీనవ రాత్రి ఉత్సవాల భక్తమండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందచేశారు.

సాయిబాబా ఆలయంలో లక్ష పుష్పార్చన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని షిరిడిసాయిబాబా ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సరస్వతీదేవి అవతారంలోని అమ్మవారికి లక్ష పుష్పాలతో అర్చనలు జరిపించారు. మంచాల పవన్‌కుమార్ దాత లక్ష పుష్పాలను పలురకాలుగా తెప్పించి ఆలయానికి సమర్పించారు. అర్చకులు భానుప్రకాష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రభాకర్, సతీష్, వెంకట్రావు పాల్గొన్నారు.


అమ్మవారి హోమంలో పాల్గొన్న భక్తులు


చల్వాయిలో పూజలో పాల్గొన్న భక్తులు

'విందుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాం'

భూపాలపల్లి అర్బన్ : సింగరేణి కార్మికులకు యాజమాన్యం ఇవ్వాలనుకునే విందులను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపేటి రాజయ్య తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు, కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల ద్వారా సింగరేణి యాజమాన్యం విందులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ జోక్యం చేసుకోవాలని చూస్తుందన్నారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించిన తర్వాత కార్మికులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడంలో ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



భూపాలపల్లి అర్బన్ : మండలంలోని కొంపల్లి క్రాస్ వద్ద పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బుధవారం కొంపల్లి క్రాస్‌వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాలీ వాహనంలో పీడీఎస్ బియ్యంతో అనుమానాస్పదంగా వెళ్తున్న వ్యక్తి కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. గణపురం మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన కొండపల్లి సురేష్‌గా ఒప్పుకోవడం జరిగిందన్నారు. గత కొంత కాలంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. కొంపల్లిలో 35 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపారు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన ముంజాల రాకేష్‌తో కలిసి బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు వివరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీఓఏలకు చీరల పంపిణీ


చీరలు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ అంకిత్‌వర్మ

చిట్యాల: స్థానిక యూనియన్ బ్యాంక్ పరిధిలోని గ్రామైఖ్య సంఘాల వీఓఏలకు బ్యాంకు మేనేజర్ అంకిత్‌వర్మ బుధవారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో మహిళా సభ్యులకు బ్యాంకు లోన్లు ఇప్పించి ప్రతి నెల వాయిదా బకాయిలను చెల్లించి ప్రభుత్వ రాయితీ వడ్డీలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం మంజుల, ఆర్పీఓ జగదీష్ , సీసీలు లలిత, రమణాదేవి, వీఓఏలు పాల్గొన్నారు.